

కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- ఓబుళదేవరచెరువు

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్షులు కుల్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీ రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక కదిరి హిందూపురం ప్రధాన రహదారిపై ఒక గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు 15 నెలలు వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎంపీడీవో వరలక్ష్మి, ఎఎస్ఐ వెంకటరమణ నాయకులతో చర్చించారు. అధికారుల హామీతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం నాయకులు బాబు, రమేష్ ,అంజినప్ప, రామప్ప ,రమణప్ప, నిర్మల, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగుబడి తగ్గుతోంది..!

◆ 18 లక్షల ఎకరాల నుంచి 15 లక్షలకు తగ్గుదల

◆ ఈ ఏడాది పది లక్షల్లోపే



పంటలేక బీడుగా ఉన్న పొలం

సంవత్సరం	సాధారణ సాగు	సాగైంది (లక్షల ఎకరాల్లో)
2014	20.78	17.16
2015	20.65	15.23
2016	20.52	18.95
2017	19.79	15.08
2018	18.45	14.90
2019	17.49	14.21
2020	16.80	15.68
2021	16.80	15.83
2022	16.12	16.75
2023	16.16	9.23

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువుతో పోరాటం సాగించే 'అనంత' రైతుల్లో సాగుపై ఆసక్తి తగ్గుతోంది. క్రమక్రమంగా జిల్లాలో సాగు విస్తీర్ణం పడిపోతోంది. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 23 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యేవి. అటువంటిది క్రమంగా తగ్గుతూ 15 లక్షల ఎకరాల్లోపుకు పడిపోయింది. 2014 సంవత్సరంలో 17.16 లక్షల ఎకరాలుండే సాగు విస్తీర్ణం తగ్గుతూ ఈ ఏడాది 9.23 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఒకప్పుడు జిల్లాలో 23 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యేవి. క్రమంగా తగ్గుతూ వస్తుండటం గమనార్హం.

మరింతగా పడిపోయిన వేరుశనగ

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గిపోతుండగా ప్రధాన పంట అయిన వేరుశనగ మరింత అధికంగా పడిపోతోంది. సాగునీటి వసతి తక్కువగానున్న ఈ ప్రాంతంలో వర్షాధారం కింద అత్యధికంగా సాగయ్యేది వేరుశనగ పంటయే. ఈ దశబ్ధాకాలంలో మరింత ఎక్కువగా సాగుపడిపోయింది. ఒకప్పుడు సాధారణ సాగులో 23 లక్షల ఎకరాలవుతుంటే 18 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగయ్యేది. ఈ ఏడాది ఆరు లక్షల ఎకరాల్లోపే పడిపోయింది. వేరుశనగ స్థానంలో కొంత వరకు ఆముదం, పత్తి పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వరుస కరువులు, పెట్టిన పెట్టుబడులు కూడా సరిగా రాకపోవడంతో రైతులు ఆ పంటపై ఆసక్తిని తగ్గించుకుంటుపోతున్నారు. ప్రభుత్వ ప్రోత్సహకాలు కరువవుతున్నాయి.

ప్రభుత్వ సహకారం కరువు

రైతు ప్రభుత్వాలు అని చెప్పుకునే పాలకులు నిత్యం కరువుతో పోరాడే రైతులకు ఆదుకునే చర్యలేవి ఉండటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేరుశనగ సాగుపై పెరుగుతున్న పెట్టుబడికి తగ్గట్టు గిట్టుబాటు ధర ఉండటం లేదు. వర్షాభావంతో పంటనష్టపోతే సరైన బీమా సౌకర్యం కూడా లేదు. వాతావరణ బీమా ఉన్నప్పటికీ నష్టానికి తగ్గట్టు పరిహారం రావడం లేదు. మరోవైపు ప్రభుత్వాలు ఇన్‌పుట్ సబ్సిడీ సైతం రాని పరిస్థితి నెలకొంది. బీమా విధానంలో మార్పులు తీసుకురావాలని రైతు సంఘాలు ఒకవైపు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారు లేరు.

ఆయకట్టు అంచనా తప్పుతోందా .?

◆ 26.828 టిఎంసిలనుకుంటే 16.097 టిఎంసిలే ◆ టిబి డ్యామ్‌లో పడిపోయిన నీటి లభ్యత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనుకున్నది ఒక్కటయితే... అయింది మరొకటి అన్నట్టుగా మారింది. జిల్లా సాగునీటి లభ్యత అంచనాలకు తప్పింది. తుంగభద్ర డ్యామ్‌కు అనుకున్నంత నీటి లభ్యత లేకపోవడంతో ముందు అనుకున్నంత నీరు జిల్లాకు వచ్చే పరిస్థితి లేదు. ఈ ప్రభావం ఆయకట్టుపై తీవ్రంగా పడే సూచనలు కనిపిస్తున్నాయి. ముందు అంచనా ప్రకారం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు 26.828 టిఎంసిల నీరు లభిస్తుందని అంచనా వేశారు. ప్రస్తుతమున్న పరిస్థితులను తుంగభద్ర బోర్డు అధికారులు గురువారం అంచనా వేశారు. తుంగభద్ర డ్యామ్‌లో జరిగిన సమావేశంలో తుంగభద్ర డ్యామ్ ఎస్ఇ శ్రీకాంత్‌రెడ్డి, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఎస్ఇ రాజశేఖర్, లోకలేజేషన్ ఇఇ ఎంవి.రమణారెడ్డి, ఎల్ఎల్‌సి ఇఇ నీలకంఠారెడ్డి పాల్గొన్నారు. సెప్టంబరు మంచి వర్షాలొస్తే నీరు పుష్కలంగా వస్తుందని భావించారు. కాని ఆశించినంత వర్షాలు రాలేదు. దీంతో నీటి లభ్యత పూర్తిగా పడిపోయింది. ముందుగా వస్తుందని వేసుకున్న అంచనా ప్రకారం 26.828 టిఎంసిలకుగానూ 16.097 టిఎంసిలు మాత్రమే ఈ ఏడాది కేటాయింపులకు పరిమితం చేశారు. ఇందులో ఇప్పటికే 8.55 టిఎంసిలు జిల్లాకు చేరింది. మిగిలిన 7.547 టిఎంసిలు రావాల్సి ఉంది.

ఆయకట్టు ప్రశ్నార్థకం

ముందు అంచనా ప్రకారం పది టిఎంసిలు సాగునీటికి, 16 టిఎంసిలు ఆయకట్టుకు అని సాగునీటి సలహామండలి సమావేశంలో తీర్మానించారు. మారిన అంచనాల ప్రకారం 16 టిఎంసిలే వస్తే ఇది తాగునీటికి కూడా సరిపోయే పరిస్థితి ఉండదు. ఎందుకంటే 16 టిఎంసిల్లో ప్రవాహ నష్టంపోనూ పది టిఎంసిల మిగులు మాత్రమే ఉంటుంది. ఈ పది టిఎంసిలు తాగునీటి అవసరాలకు వినియోగిస్తే, ఇక సాగునీరు పూర్తిగా ప్రశ్నార్థకం కానుంది. ముందు అంచనా ప్రకారమైతే 11 టిఎంసిలు సాగునీటికి కేటాయించి లక్ష ఎకరాలకు నీరివ్వాలన్నది అంచనా. కాని సాగునీటికి వచ్చే నీరు వాడితే తాగునీటి అవసరాలకు కొరత ఏర్పడనుంది. ప్రాధాన్యత క్రమంలో తాగునీటికి ప్రాధాన్యత ఇచ్చే అకాశమున్నందున ఆయకట్టు పూర్తిగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

పారిశ్రామిక వాడలో సెక్యూరిటీ గార్డు మృతి

రూ.2లక్షలకు విలువ కట్టిన ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడలో మెగా స్టీల్స్ పరిశ్రమ మూతపడింది. పరిశ్రమకు బెంగళూరుకు చెందిన ఫెడరల్ సెక్యూరిటీ ఏజెన్సీ వారు సెక్యూరిటీ నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే సెక్యూరిటీ గార్డు పెనుగొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు (50) విధి నిర్వహణలో ఉండగా గురువారం ఉదయం హఠాత్తుగా మృతిచెందాడు. ఇతనికి సంస్థ ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయలేదు. చట్టాలను అమలు చేయక పోవడంతో ఆ కార్మికుడి కుటుంబం రోడ్డున పడింది. ఇదిలా ఉండగా మృతిచెందిన సెక్యూరిటీ గార్డు ప్రాణానికి రూ.2లక్షలు విలువ కట్టారు. తోటి సెక్యూరిటీ గార్డులు, కార్మిక సంఘం నాయకులు ఏజెన్సీలు నిర్వహకులతో మాట్లాడితే ఆయన రూ.2లక్షలు ఇస్తామని చెప్పి వెంటనే రూ.70వేలు ఇచ్చి మిగిలిన రూ.1.30వేలు మూడు రోజుల్లో ఇస్తామని చెప్పి బయటకు రాకుండా చూశారు.

హార్స్ రైడింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

హార్స్ రైడింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు.గురువారం బీడుపల్లిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్జే స్పోర్ట్స్ అకాడమీని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ హార్స్ రైడింగ్ చేశారు. అకాడమీలో హార్స్ రైడింగ్, రైఫిల్ షూటింగ్, స్కేటింగ్ మొదలగు వాటిపై శిక్షణ తీసుకోవడం వల్ల నేషనల్ స్థాయిలో పోటీలకు ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీ విద్యా నరసింహ భారతి, సంస్కృతి స్కూల్ ఆఫ్ బిజినెస్ ఛైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి, ఆర్జే స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ నవీన్, సందీప్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ట్యాబ్'లో సాఫ్ట్‌వేర్ మారిస్తే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించిన జగనన్న ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్, బైజూస్ యాప్‌లను తొలగించి మరో సాఫ్ట్‌వేర్ వేయాలని చూసే మొబైల్ సెంటర్ల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో గురువారం మొబైల్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన జగనన్న ట్యాబ్‌లతో కొంత మంది విద్యార్థులు మొబైల్ సెంటర్లకు వచ్చి సాఫ్ట్‌వేర్ మార్పించుకోవడం, గేమ్స్ ఎక్కించుకోవడం తదితర అనవసరమైన వెబ్‌సైట్లు వేయించుకుంటున్నారన్నారు. విద్యార్థులు ఏ మొబైల్ సెంటరుకు వచ్చినా ట్యాబ్‌లో ఎలాంటి సాఫ్ట్‌వేర్ మార్చరాదన్నారు. అలా ఎవరైనా విద్యార్థులు వస్తే తమ దృష్టికి తీసుకునిరావాలని సూచించారు. విద్యార్థులు కూడా కేవలం చదువు కోసం మాత్రమే ట్యాబ్లు ఉపయోగించాలని, ఇళ్ల వద్ద తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

మట్టి ఎక్కడపడితే అక్కడ వేస్తే చర్యలు : ట్రాక్టర్లు నడిపే వారు పనికిరాని మట్టిని ఎక్కడపడితే అక్కడ పట్టణంలో వేస్తున్నారని అలా ఎవరైనా వేస్తే వారిపై చర్యలు తప్పవని సిఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. వృథా మట్టిని రహదారుల్లో ఉన్న గుంతలు, రహదారుల పక్కన ఇలా ఎక్కడైనా వేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువుల డాక్టర్లను నియమించాలని వినతి

ప్రజాశక్తి - అమరాపురం

నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న చోట్ల పశువుల డాక్టర్లను నియమించాలని స్థానిక జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు కోరారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేతన్‌గార్గ్‌కు వినతిని అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలకు 12 వెటర్నరీ ఆసుపత్రులు 12 పీహెచ్‌సిలు ఉన్నాయన్నారు. అందులో ఐదు మండలాలకు ఏ ఒక్క డాక్టర్ కూడా లేకపోవడంతో మూగ జీవాల రైతులు నష్టపోతున్నట్లు చెప్పారు.

అధికారుల నమ్మకద్రోహం

◆ పట్టాలిస్తామని నమ్మించి.. కొట్టాలు తొలగింపు

◆ పోలీసు బలగం, జెసిబిలతో నానాహంగామా..

◆ బలవంతంగా పేదలు, సిపిఎం నాయకుల అరెస్టు

◆ చిలమత్తూరులో పేదలకు అన్యాయం చేసేలా అధికారుల కుట్ర

ప్రజాశక్తి-చిలమత్తూరు

'పేదలు గుడిసెలు వేసుకున్న చోటే ఇంటి పట్టాలు ఇస్తాం.. ఇందులో ఎలాంటి అనుమానం లేదు.. మమ్మల్ని నమ్మండి' అంటూ రెండు రోజుల క్రితం చిలమత్తూరు తహశీల్దార్ సిపిఎం, వ్యకాసం నాయకుల సాక్షిగా పేదలకు హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని చిలమత్తూరులో పేదలు గత 15 రోజులుగా సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్నారు. కోడూరు రెవెన్యూ పొలం 805 సర్వే నెంబర్‌లో కొట్టాలు వేసుకుని అక్కడే ఉంటున్నారు. రెండు రోజల క్రితం వీరందరికీ పట్టాలు ఇస్తామని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ హామీని తుంగలో తొక్కి పేదలకు నమ్మకం ద్రోహం చేసే చర్యలను అధికారులు చేశారు. గురువారం వేకువజామున సుమారు వంద మంది పోలీసులు జెసిబిలో 805 సర్వే నెంబర్‌లోకి చొరబడ్డారు. పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చిపడేశారు. అడ్డుపడ్డ పేదలు, సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. మహిళలని చూడకుండా ఈడ్చుకుంటూ విచక్షణ రహితంగా వారిని లారీల్లోకి విసిరిపారేశారు. పట్టాలు ఇస్తామని నమ్మించి అధికారులు పోలీసు బలగాలతో గుడిసెలు కూల్చేయడంపై పేదలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుడిసెల కూల్చివేత... పేదలు, నాయకుల అరెస్టు

కోడూరు రెవెన్యూ పొలం 805 సర్వే నెంబర్‌లో వేసుకున్న గుడిసెల వద్దకు గురువారం వేకువజామున పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకున్నారు. రావడంరావడమే గుడిసెలను కూల్చివేసి భయానక వాతావరణాన్ని సష్టించారు. అక్కడే నిద్రిస్తున్న పేదలు, సిపిఎం నాయకులు దీనిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. జెసిబిలకు అడ్డుపడ్డారు. పోలీసులు వారిని పక్కకు నెట్టేశారు. 'సార్.. మాకు నిలువనీడ లేదు.. గుడిసెలను తొలగించొద్దంటూ' పేదలు ప్రాధేయపడినా పోలీసులు కనకరించలేదు. పోలీసులు దొరికినవారిని దొరికనట్టు బలవంతంగా అరెస్టు చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సిఐటియు జిల్లా నాయకులు రమేష్, కమిటీ సభ్యులు శివ, రహంతుల్లా, చరణ్, నరసింహ, సదాశివరెడ్డి, రాజు, మంజు, మహిళలను అరెస్టు చేసి చిలమత్తూరు, లేపాక్షి పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టు చేసే క్రమంలో పలువురు మహిళలకు రక్తగాయాలు అయ్యాయి. గుడిసెల్లో పేదలు ఏర్పాటు చేసుకున్న మంచాలు, వస్తువులు, నిత్యావసరాలను చిందరవందర చేశారు. పోలీసులు, అధికారుల తీరుపై సిపిఎం నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు పట్టాలిస్తామని నమ్మించి మోసం చేసిన తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 805 సర్వే నెంబర్ భూమిని వైసిపి నేతలకు కట్టబెట్టేందుకే అధికారులు పేదలకు అన్యాయం చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. ఈ ఉద్యమాన్ని ఇంతటితో ఆపేది లేదని, పేదలకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

పేదల గుడిసెలను తొలగించి, నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పేదలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జివిఎల్.నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ పేదలు ఇళ్ల స్థలాలు అడుగుతుంటే ఇచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులకు చేతులు రావడం లేదన్నారు. శాంతియుతంగా పోరాటం చేస్తున్న పేదలపై ఈ రకమైన బలవంతపు దాడులు చేసే విధానాలను సరికాదని విమర్శించారు. రాత్రి సమయంలో పెద్దసంఖ్యలో పోలీసులు మోహరించి, పేదలను కొట్టడం, భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. అరెస్టులతో పేదల ఉద్యమాన్ని ఆపాలని చూడడం అవివేకమే అవుతుందన్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఈ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో పేదలు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అధికారులు చేసేది లేక మరోసారి వారితో చర్చలు జరిపారు. శనివారం నాడు జాయింట్ కలెక్టర్‌ని కలిసి సమస్య పరిష్కరిస్తానని తహశీల్దార్ పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాంటి హామినే ఇచ్చి గుడిసెలు కూల్చేశారని, అధికారులపై తమకు నమ్మకం లేదని పట్టాలిచ్చేంత వరకు ఆ స్థలంలోనే తాము ఉంటామని పేదలు తహశీల్దార్ ఎదుట తెగేసి చెప్పారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద కూడా దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో పేదలనుద్దేశించి మాట్లాడుతున్న దడాల సుబ్బారావు



సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు



పోలీసుల దాడిలో గాయపడిన మహిళ

భారత వికలాంగ క్రికెట్ జట్టు కెప్టెన్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి - హిందూపురం

ఈ నెల 12 వ తేదీ నుండి బాంగ్లాదేశ్ లో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ పోటీలలో పాల్గొననున్న భారత వికలాంగ క్రికెట్ జట్టు కెప్టెన్ వసంత్ కుమార్ కు ఎస్‌డిజిఎస్ కళాశాల కరెస్పాండెంట్, సెక్రటరీ బైసాని రాంప్రసాద్ ఆర్థికసాయం అందించారు. అదే విధంగా ఇటీవల హిందూపురం ప్రజాశక్తి విలేకరి షబ్బీర్ రాష్ట్ర స్థాయిలో బొమ్మరెడ్డి అవార్డును తీసుకున్న సందర్భంగా అతడిని కళాశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ రేవూర్ చంద్రమోహన్, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, జిల్లా బాధ్యులు మురళి, కళాశాల ప్రిన్సిపల్స్ జెఎస్‌విఎస్. ప్రసాద్, డాక్టర్ నాగేంద్ర కుమార్, పీడీ హేమంత్ కుమార్, ఉమర్ ఫారూఖ్ ఖాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి న్యాయవాదుల నిరసనాగ్రహం

విధులు బహిష్కరించి ఆందోళన



కోర్టు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న పుట్టపర్తి న్యాయవాదులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కక్షిదారుల పక్షాన దాఖలు చేసే ప్రతి పిటిషన్ పై వెల్ఫేర్ స్టాంప్‌ను హెచ్చు గా పెంచడం పై పుట్టపర్తి బార్ అసోసియేషన్ తీవ్రంగా ఆక్షేపించి నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. ఎపి బార్ కౌన్సిల్ నిర్ణయం ఏకపక్షమని మండిపడ్డారు. ఇటీవల ఎఏపి బార్ కౌన్సిల్ వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం ప్రతి పిటిషన్ పై దాఖలు చేసే వెల్ఫేర్ స్టాంప్‌ను దాదాపు గా ఇరవై రెట్లు పెంచిందన్నారు .తద్వారా పిటిషన్ దాఖలు చేసే అంశం భారంగా పరిణమిస్తుంది. దీని ద్వారా కక్షిదారుల పక్షాన రోజు వారీ దాఖలు చేసే అనేక పిటిషన్లకు వెల్ఫేర్ దాఖలు అనేది న్యాయవాదులకు భారమవుతుందన్నారు. దీని ద్వారా కక్షిదారులకు సైతం అధిక వ్యయం భరించాల్సివస్తుందని చెప్పారు. న్యాయవాదులు కక్షిదారుల మధ్య రుసుము చెల్లింపు వ్యవహారంతో భారీ వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయన్నారు. ఎపి బార్ కౌన్సిల్ కింది స్థాయిలో బార్ అసోసియేషన్ ను సంప్రదించకుండా ఏక పక్ష నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. వెంటనే జిల్లా నుండి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో ప్రాతినిధ్యం వహిస్తున్న రామిరెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పుట్టపర్తి న్యాయ వాదులు డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా ఈ నెల 4 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు విధులు బహిష్కరిస్తున్న పుట్టపర్తి న్యాయమూర్తి రాజేష్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు బయట నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్ రెడ్డి, నిడిమామిడి శ్రీనివాసులు, బి. క్రిష్ణమూర్తి, లెక్కల యదుభూషన్, నాగేంద్ర, రాజగోపాల్, లెక్కల కృష్ణ ప్రసాద్, నాగార్జున, మహేష్, మౌనిక, భారతి, బిందు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని చౌడేశ్వరిదేవి కల్యాణ మండపంలో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ మహాసభలలో నాగభూషణతోపాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి ఈఎస్ వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగభూషణ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నాలు, ఆందోళనలు, వినతిపత్రాలు తదితర కార్యక్రమాలు చేసిన ప్రభుత్వం కానీ అధికారులు కానీ ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. మున్సిపాలిటీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థంకాలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా కార్మికులు పర్మినెంట్ చేయడం, సమాన పనికిసమాన వేతనం, సంక్షేమపథకాలు అమలుచేయడం లాంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, పారిశుధ్యకార్మికసంఘం నాయకులు బాబు, చెన్నకేశవులు, ప్రసాద్, పుల్లన్న, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన 'నాడు-నేడు' పనులు

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని డివిఇఒ రఘునాథరెడ్డి ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డికి సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా వడ్డించారు. అదేవిధంగా కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడుచక్రాల సైకిళ్లు పంపిణీ

తలుపుల : మండలంలోని అభయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వికలాంగులకు మూడుచక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మంది వికలాంగులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ కార్యాలయ అధికారులు అంజనమ్మ, రాజేంద్ర, తహాశీల్దార్ శ్రీధర్, వైసిపి మండల కన్వీనర్ ఫయాజ్, అభయ మండల సమైఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఉలవలు పంపిణీ

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలోని మైలసముద్రం గ్రామ రైతు భరోసా కేంద్రంలో 80 శాతం సబ్సిడీతో ఉలవలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైలసముద్రం రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై చికెన్ వ్యర్థాలు

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని బాబాసాపల్లికి వెళ్లే రహదారిలో చికెన్ వ్యర్థ పదార్థాలను వేస్తున్నారని గ్రామస్తులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చికెన్ వ్యర్థపదార్థాలు వేయడం వల్ల ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రత్నమ్మ, వరమ్మ అంజనమ్మ, శిల్ప, సూర్యనారాయణ, అమానుల్లా, హరి, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

బత్తలపల్లి : బత్తలపల్లిలోని పలు కాలనీలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్విత పరిష్కారం చూపుతామని జెడ్పీటీసీ కోటి సుధ, తహసీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై స్పందించిన అధికారులు, పాలకులు గురువారం ఆయా కాలనీల్లో పర్యటించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నీటి సమస్య పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఓబుల దేవర చెరువు : పౌష్టికాహారంతో ఆరోగ్యమని మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం భాగంగా అల్లాపల్లి సెక్టర్‌లోనిగౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పౌష్టికాహార ప్రదర్శనను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తుమ్మల పర్వీన్, షామీర్, ఎంపీడీవో వరలక్ష్మి, తహశీల్దార్ రామ్నాథ్ రెడ్డి, సర్పంచి వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

దాతల దాతృత్వం మరువలేనిదని మండల విద్యాధికారి గోపాల్ అన్నారు. మండలంలోనిదిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి సతీమణి నంజమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు పాకాల సిఐ గౌని ఓబులేసు తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాదాపు 20 వేల రూపాయల విలువజేసే విద్యాసామగ్రి అందజేశారు. అదేవిధంగా సొంత ఊరిపై మమకారంతో పాఠశాలకు అవసరమైన అదనపు గదుల నిర్మాణానికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సిఐ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్ నాయక్, విద్యా కమిటీ చైర్మన్ బయప రెడ్డితో పాటు సిఐ కుటుంబ సభ్యులు, స్నేహితులు తిరుపాల్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీరామ్ రెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, మహిళా రైతులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి గ్రామానికి చెందిన దళిత, బలహీనవర్గాలకు చెందిన సుమారు 90 మంది నిరుపేద కుటుంబాలు పండిపర్తి రెవెన్యూ పొలంలో భూమి సాగు చేసుకుంటున్నాయని వీరికి పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు, ఈసందర్భంగా సాగుదారులు సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహ మూర్తి కి గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సర్వేనెంబర్ 384 నందు గల ప్రభుత్వ భూమిలో లక్షలది రూపాయలు ఖర్చుపెట్టి వ్యవసాయ సాగుభూములుగా మార్చి పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం చేపట్టే భూ పంపిణీలో సాగుదారులుగా గుర్తించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గంగాభవాని, శ్యామలమ్మ, గంగమ్మ సిపిఎం నాయకులు గోవిందప్ప కిష్టప్ప, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, మండలాధ్యక్షుడు వెంకటేష్ తదితర రైతులు పాల్గొన్నారు

గురువు లేని సమాజాన్ని ఊహించలేం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

గురువు లేని సమాజాన్ని ఊహించలేమని, గురువుతోనే సమ సమాజం ఏర్పడుతుందని విశ్వభారతి స్కూల్ కరెస్పాండెంట్ షేకూన్, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి కేకును కట్ చేసి, వేడుకలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి కేవలం ఉపాధ్యాయునికే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన్ భాషా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కీలకం : విద్యార్థులకు మంచి భవిష్యత్తుకు పునాది ఉపాధ్యాయులే వేస్తారని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ గ్రంథాలయంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠకులు, విద్యార్థులు నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూరి వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణ నాయక్, గంగాధర్, అధిక సంఖ్యలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రోత్సాహకం

పుట్టపర్తి అర్బన్ : ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు పురస్కారాలు ఇచ్చి సత్కరించారు. గురువారం ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న వారిలో ఉత్తమ కండక్టర్లుగా ఎంపికైన వెంకటేశ్వర్లుకు రూ. 500, శ్రీనివాసులుకు రూ. 400, నిర్మలా దేవికి రూ. 300, పెద్దన్న, శ్రీరాములు, మౌలాలికి 100 రూపాయలు చొప్పున డిఎం ఈనయతుల్లా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే డీజిల్ ఆదాచేసిన గంగాద్రి, నూర్ మహమ్మద్, వెల్డర్ సూర్యనారాయణ, కార్యాలయ సిబ్బంది గోవిందరావుకు తగిన ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఐ పెద్దన్న, ఎఎంఎస్ ఎస్పీ నాయక్, శోభారాణి, శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు ఎస్ఐగా గంగాధర్

చిలమత్తూరు : చిలమత్తూరు ఎస్ఐ వి.గంగాధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై వెళ్లగా గంగాధర్ అనంతపురం 4 వ పోలీస్ స్టేషన్ నుండి చిలమత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అసుపత్రి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు గురువారం సిపిఐతో పాటు ప్రజా సంఘాల నాయకులు అసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల ఆగ్రహం : మరణధ్రువపత్రం మంజూరులో జాప్యం చేస్తున్నారని గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద మండలంలోని బీరేపల్లికి చెందిన మహేశ్ కుటుంబ సభ్యులు, పసిబిడ్డతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ తన భార్య చంద్రకళ(25) గతనెల 2వ తేదీ రాత్రి ప్రభుత్వాసుపత్రిలో ప్రసవానికి వస్తే 9వ తేదీ వేకువజామున ఆడబిడ్డకు జన్మనిచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు అధిక రక్తస్రావం కావటంతో అనంతపురానికి రెఫర్ చేయటంతో మార్గమధ్యలోనే మృతిచెందిందన్నారు. దీనికి సంబంధించి మరణధ్రువపత్రం మంజూరు చేయాలని స్థానిక గ్రామకార్యదర్శిని కోరితే తమకు సంబంధంలేదని, ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలని అంటున్నారన్నారు. ఇక్కడ అడిగితే తాము ఇవ్వలేమంటున్నారని అన్నారు. స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ బాధితులతో చర్చించి సంఘటన వివరాలు తెలుసుకొని గ్రామ కార్యదర్శి మరణధ్రువపత్రం అందించాలని ఫోన్లో మాట్లాడి ధ్రువపత్రం ఇచ్చేవిదంగా చేశారు. బాధితులు నిరసన వ్యక్తం చేసే సమయంలో ఆసుపత్రి ప్రధాన ద్వారం అద్దాలు పగిలిపోయాయి.

క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

క్రీడల పట్ల విద్యార్థులు యువకులు ఆసక్తి పెంచుకోవాలని వైసిపి సిఇసి సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి తనయుడు, వైసిపి యువ నాయకులు చక్రధర్ రెడ్డి తెలిపారు కొత్త చెరువులోనే సత్యసాయి జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి సోమశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 6 మండలాల్లోనూ ఈ క్రికెట్ టోర్నమెంట్లను ప్రారంభించామన్నారు. 26 రోజుల నుండి ఈ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయన్నారు. కొత్తచెరువు మండలంలో 25 టీములు పాల్గొన్నాయన్నారు గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఇండియన్ జూనియర్ టీం ఇండియన్ సీనియర్ టీం తలపడగా సీనియర్స్ టీం విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో సింగల్ విండ్ మాజీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్ సాలమ్మ గారి శివ, వైసిపి నాయకులు బాలచంద్రారెడ్డి, రామచంద్ర, పాపన్న, సుహల్ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

దేశంలో రైతాంగం తర్వాత అతిపెద్ద సంఘం హస్తకళల రంగమని హస్తకళల సేవా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి అన్నారు. కదిరి పట్టణంలోని దత్తా ఫంక్షన్ హాల్ నందు శుభయ శ్రీ శారీ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో హస్తకళలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ యశోద మాట్లాడుతూ కదిరి కేంద్రంగా హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ క్రాఫ్టును ప్రోత్సహించడానికి అన్ని విధాల సహకరిస్తామని అన్నారు. ఇప్పటికే అనేకమంది హస్త కళాకారులకు ప్రభుత్వం నుండి గుర్తింపు కార్డులు ఇప్పించామని రానున్న రోజుల్లో పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. దేశంలో 744 క్లస్టర్లలో వివిధ రకాల హస్తకళ ఉత్పత్తులు తయారై ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందుతున్నట్లు చెప్పారు. 60 లక్షల కుటుంబాలకు పరోక్షంగా హస్తకాళల రంగం తరపున ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిజైనర్ రాజేష్, సునీత, క్లస్టర్ మేనేజర్ ఎస్ ఎం అలీ, లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలను పూర్తిస్థాయిలో వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి, కదిరి టౌన్

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను గ్రామ గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. కదిరి పట్టణం షాలిమార్ ఫంక్షన్ నందు మున్సిపాలిటీ, కదిరి రూరల్ మండలానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, జెసిఎస్ ఇన్‌ఛార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 11 నుండి నిర్వహించు ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అన్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో సూచించారు.. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన కార్యక్రమాల కరపత్రాన్ని గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాల వ్యత్యాసాల కరపత్రాన్ని ప్రజలకు చూపించాలన్నారు. ప్రతి ఒక్కరు సమిష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఛైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే బాధ్యత బూత్ కన్వీనర్లు, సచివాలయ వాలంటీర్లదేనని వైసిపి ఇన్‌చార్జి దీపిక వేణు రెడ్డి అన్నారు.గురువారం పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూపూర్ రూరల్ మండలం ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గహసారథులు,వాలంటీర్లు లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ సంతేబిదునురు రాము, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, సర్పంచులు ఉపేంద్ర రెడ్డి, అశ్వర్థ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌డిజిఎస్ కళాశాల కరెస్పాండెంట్, సెక్రటరీ బైసాని రాంప్రసాద్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని హిందూపురం విలేకరి షబ్బీర్ ఆధ్వర్యంలో ఎస్‌డిజిఎస్ డిగ్రీ, ఎంబిఎ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅథితులుగా వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, కళాశాల అధ్యక్షులు రేవూరి చంద్రమోహన్, కళాశాల కరెస్పాండెంట్, సెక్రేటరీ బైసాని రాంప్రసాద్, టిప్పుసుల్తాన్ రక్తదాన జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేణురెడ్డి మాట్లాడుతు రక్తదానం చేయడానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాల్సి అవసరం ఉందన్నారు. నేడు ఎన్నో ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించి సకాలంలో రక్తం అందక ఎన్నో నిండు ప్రాణాలు పోతున్నాయన్నారు. ఒక వ్యక్తి రక్తం ఇవ్వడం వల్ల నలుగురికి ప్రాణదానం చేయడానికి అవకాశం ఉందన్నారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ప్రాణ నష్టం జరగదని,ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాశక్తి వారు ఎంతో బాధ్యత తీసుకుని రక్తదానంపై అవగాహన పెంచుతు, మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ప్రతి అక్షరం...ప్రజల పక్షం అనే నినాదంతో ముందుకు వచ్చిన ప్రజాశక్తి ఎక్కడ రాజీ పడకుండా ఎన్నో ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతు ప్రజాశక్తి పత్రిక విశిష్టత గురించి వివరించారు. అదే విధంగా కరోనా విపత్కర సమయంలో చేసిన సేవలు, ఇతర కార్యక్రమాల గురించి వివరించారు. బైసాని రాంప్రసాద్ మాట్లాడుతు నేడు ఎన్నో పత్రికలు ఉన్నాయనిఅయితే ఎవరు చేపట్టని ఎన్నో సేవా కార్యక్రమాలను ప్రజాశక్తి నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మెగా రక్తదాన కార్యక్రమాన్ని తమ కళాశాలలో ఏర్పాటు చేయడం చాల సంతోషంగా ఉందన్నారు. టిప్పుసుల్తాన్ రక్తదాన జాతీయ అద్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతు ఒక వ్యక్తి తన జీవితకాలంలో 135 సార్లు తన రక్తాన్ని దానం చేయడానికి సాధ్యం ఉందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి తప్పకుండా రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ రక్తదాన శిబిరంలో కళాశాల విద్యార్థులతో పాటు కళాశాల కళాశాల కరెస్పాండెంట్, సెక్రేటరీ బైసాని రాంప్రసాద్, అధ్యాపకులు రక్తదానం చేశారు. అనంతరం ముఖ్యఅథితులకు ప్రజాశక్తి తరపున జ్ఞాపికను, కళాశాల తరపున శాలువాలను జ్ఞాపికలను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జెవిఎస్ వివిఎస్ ప్రసాద్, ఎంబిఎ ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, ప్రజాశక్తి ఎడిషన్ భాధ్యులు మురళి, కళాశాల ఎన్ సిసి అఫిసర్ ఫణింద్ర, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాజన్న, పీడీ హేమంత్, బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్లు సోము, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న వైసిపి నాయకులు వేణురెడ్డి. ప్రజాశక్తి మేనేజర్ వేణుగోపాల్



కమిషనర్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

గుప్త నిధుల వేటగాళ్లపై కేసు

అమరాపురం : మండల పరిధిలోని పేలుబండ చెరువు మరువ సమీపంలో మంగళవారం రాత్రి గుప్తనిధుల కోసం జెసిబి తో త్రవ్వకాలు చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. అమరాపురం గ్రామానికి చెందిన కాంతరాజు, చిట్నడకు మంజునాథ్, ఆలదపల్లి మూర్తి, జెసిబి డ్రైవర్ గుడిబండ మండలం చిగదుర్తి రాముపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గుప్తనిధుల కోసం త్రవ్వకాలు జరుగుతున్నాయని పేలుబండ గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆ నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ మధు, పోలీస్ కానిస్టేబుళ్లు రమేష్, శ్రీరంగ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కనగానపల్లి : మండలంలోని నెమలివరం గ్రామానికి చెందిన వీరాంజనేయులు (33) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వీరాంజనేయులు గురువారం మధ్యాహ్నం మధ్యాహ్నం తన ఇంటి ముందర ఉన్న చెట్టు కొట్టుతుండగా చెట్టు పైభాగంలోని విద్యుత్‌వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురంలో ఓ వ్యక్తి ఇంటిలో గురువారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన నూరుల్లా(45) కప్ బోర్డు పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు నూరుల్లాను స్థానిక ప్రభుత్వాస్పత్రికితరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మతునికి భార్య షమీమ్, ఇద్దరు కుమారులు ఉన్నారు. నూరుల్లా ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు విచారణలో తెలియాల్సుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

బత్తలపల్లి : మండల పరిధిలోని గుమ్మలకుంట బస్టాప్ సమీపంలో అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై గురువారం ఆటో, కారు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు... ముదిగుబ్బ నుంచి ఆనంతపురం వైపు వస్తున్న ఆటోను బత్తలపల్లి నుంచి పత్యాపురానికి వస్తున్న మారుతి సుజికి కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన మల్లేసు, నాగేంద్రమ్మ, ఆటో డ్రైవర్ రామాంజనేయులు(అనంతపురం) తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

రొద్దం : గత నెల 20 వ తేదీన వినాయక నిమజ్జనం సందర్భంగా మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి పోలీసులు గురువారం విచారణ చేపట్టారు. పెనుకొండ డీఎస్పీ హుసేన్ పీరా, రొద్దం జమేదార్ వలి, పోలీసులు గోపాల్ నాయక్, నాయకులు మూర్తి, శంకర్, కల్లుకుంట స్థానికులు బూతప్ప, హనుమంతరాయుడు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కదిరి టౌన్ : కదిరి రూరల్ చవిటితండా గ్రామానికి చెందిన బుక్యా శంకర్ నాయక్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ కదిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అర్హులందరికీ ఓటుహక్కు : ఆర్డీవో

ధర్మవరం టౌన్ : నియోజకవర్గంలోని అర్హత గల వారందరికీ తప్పనిసరిగా ఓటు హక్కును కల్పిస్తామని ఆర్డీవో తిప్పే నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు పలు సలహాలు సూచనలను ఆర్డీవో దృష్టికి తీసుకొని వచ్చారు. ఫిర్యాదుల మేరకు విచారణ నిష్పక్షపాతంగా కొనసాగిస్తున్నామని, అందరికీ న్యాయం జరిగేలా, అర్హత గల వారందరికీ ఓటు హక్కు కలిగేలా గట్టి చర్యలు తప్పక తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరి దేవి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బుక్కపట్నం : ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు అమర చంద్రబాబు , మండల అధ్యక్షురాలు మంజుల తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా రేవతి, ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా శ్రావణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఆర్ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పుట్టపర్తి రూరల్ : ఎఆర్ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం తన చాంబర్‌లో ఎఆర్ పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో, వ్యక్తిగతంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. జిల్లాలో అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు డిపిఒలో ఉన్న ఫోర్స్ వివరాలు, వాహనాల కండిషన్లు ఈ రివ్యూ సమావేశంలో ఎస్పీ చర్చించారు. ఈసందర్భంగా ఎఆర్ సిబ్బంది వివిధ రకాల సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎస్పీ నిబంధనల మేరకు ఎఆర్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎఆర్ డిఎస్‌పి జెడ్ విజయ్ కుమార్, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కన్వీనర్లను సన్మానించిన ఎమ్మెల్యే

మడకశిర : ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన మండల కన్వీనర్లను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా పట్టణ అధ్యక్షులు పుట్టకామప్ప,మండల అధ్యక్షులు రామిరెడ్డిలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టణంలోని ఆర్‌అండ్‌బి వసతి గృహంలో గురువారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ నూతన మండల కన్వీనర్లు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవితా సత్యనారాయణ, జెడ్పీటీసీ సరోజమ్మ మూర్తి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసింహ జయరాజ్, వైస్ చైర్మన్లు రామచంద్రారెడ్డి, వెంకట లక్ష్మమ్మ, మాజీ ఎంపీపీ బజ్జప్ప, జెఎస్‌సి కన్వీనర్ నాగేంద్ర, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం స్కానింగ్‌లను పరిశీలించిన నాయకులు

ధర్మవరం టౌన్ : ధర్మవరం మార్కెట్ యార్డ్ లో జరుగుతున్న ఇవిఎం స్కానింగ్‌లను మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దుస్సాక్రిష్ణ, రాప్తాటిరాము, నారాయణస్వామియాదవ్, లాయర్ దస్తగిరి, బోడగల గిరిధర్, చెన్నారెడ్డి, గంధమనేని నారాయణస్వామి, అంగజాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ అరుణ్‌బాబు



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్



జగనన్న సురక్ష బ్యాగులు అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బత్తలపల్లి ఎంపిపి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు పి అరుణ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తి మండలం పరిధిలోని నిడిమామిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు పి అరుణ్ బాబు వైద్యాధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్యసేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్య కోసం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన పలువురుతో కలెక్టరు ముఖాముఖి మాట్లాడారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ఓపి రిజిస్ట్రేషన్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఐటి రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, వైద్యుల గదులు, మందులిచ్చే కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వైద్యులు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించినట్లు వివరించారు. నేరుగా శిబిరానికి వచ్చిన వారికి కూడా టోకెన్లు జారీ చేసి, ఆరోగ్య డేటా ఎంట్రీ పూర్తి చెయ్యాలన్నారు. కంటి పరీక్షలను కూడా నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా కళ్లద్దాలను కూడా అందజేస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో 552 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, తాహశీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో మురళీకృష్ణారెడ్డి, ప్రత్యేక డాక్టర్లు జోత్స్న, షారుక్, ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీటీసీ రంగన్న, సర్పంచి లతా బాలు, ఇతర వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలం మల్లెపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, వైసిపి మండల సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేశ్వర రెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచి పాలకిష్ట తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదల రోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతో ఉపయోగంగా ఉంది దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామారావు కోరారు. మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణ, మెడికల్ ఆఫీసర్, స్థానిక సర్పంచి తిప్పేస్వామి, పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, ఆయాలు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : పేదలకు వైద్య చికిత్సలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో బారన్ సాబ్ తెలిపారు మండల పరిధిలోని కోదపగాని పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు, సాధారణ వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 362 మందికి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అలివేలమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు రఘునాథరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, డాక్టర్ వెంకట నారాయణ రెడ్డి, ఎపిఎం రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని మూడవ సచివాలయంలో గురువారం సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జడ్పిటిసి డిసి అశోక్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా అవసరమైన వారికి వైద్యచికిత్సలు అందజేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి వేణు, డాక్టర్ నరేష్ కుమార్, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఇఒఆర్‌డి నాగరాజ్ రావ్, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండల పరిధి లోని గౌను వారి పల్లిలో సర్పంచి బోయ ప్రభావతి ఎంపీటీసీ సుకన్యవిజయసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ గుప్త, వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమనిఎంపీపీ శ్రీధర్ రెడ్డి, తెలిపారు. గురువారం మండల పరిధిలోని సిద్ధిరాంపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, సర్పంచి వెంకట రమణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, వైద్యాధికారులు జీవన్, మమత తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టినట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తంబాపురంలో సర్పంచి సానే జయచంద్రారెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు గంగిరెడ్డి, రామకృష్ణ, స్పెషలిస్టు డాక్టర్స్ గోపిక, సమీరారెడ్డి, వాసంతి ప్రజలకు వివిధ రోగాలపైన చికిత్సలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి మనోహర్, వైసిపి మండల కన్వీకర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ స్వీనర్ ఎగ్జిక్ బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని అల్లు గుండు, చెవిటి వారి పల్లి గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానికఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి భాయ్, డాక్టర్ ఐనొద్దిన్, డాక్టర్ రోజా, ఎంపీడీవో శకుంతల, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్లు సుధాకర్, రెడ్డమ్మ, మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, నోడల్ అధికారి సెల్వి, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యం సురక్షితమని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కలిపి సచివాలయం పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులు, మండల సచివాలయాల కన్వీనర్ ఆర్ఎ. రవిశేఖర్ రెడ్డి, సర్పంచి కదిరమ్మ, తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, స్పెషల్ ఆఫీసర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మండలంలోని కాళసముద్రం సచివాలయం పరిధిలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శాసన సభ్యులు సిద్దారెడ్డి ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి నాణ్యమైన మందులనే పంపిణీ చేయాలని, అర్థం అయ్యే రీతిలో వాటి వాడకం గురించి చెప్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్ నాథ్ రెడ్డి ఎంపీడీవో. అంజినప్ప , ఎఒ వెంకట నారాయణ , కాళసముద్రం సర్పంచి లలితమ్మ , ఎంపీటీసీ ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల పరిధిలోని వెలిచలమల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాము, ఎంపీడీఒ ఆదినారాయణ, వైద్యాధికారులు డాక్టర్ ఆసియా, డాక్టర్ ఆనంద్ వర్ధన్, యూత్ కన్వీనర్ వేణుగోపాల్ యాదవ్, వాటర్ షెడ్ చైర్మన్ బయారెడ్డి, నాయకులు గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్రంలో ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి అన్నారు. గురువారం హిందూపురం రూరల్ మండలం తూమకుంటలో ఎంపిడిఒ నరేంద్ర కుమార్ అధ్యక్షతన ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హనుమంత రెడ్డి, స్థానిక సర్పంచి రత్నమ్మ, మండల కన్వీనర్ సంతెబిదునురు రాము తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గర పడ్డాయి : టిడిపి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి జగన్ ప్రవర్తన నియంతలా ఉందని ఈ నియంతకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు గురువారానికి 23వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా పల్లెతోపాటు టిడిపి నాయకులు కొమ్ము, సన్నాయి మేళాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ జగన్ ఎన్ని కుట్రలు చేసిన చంద్రబాబు త్వరలోనే జైలు నుంచి బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మహమ్మద్ రఫీ, సామ కోటి ఆదినారాయణ, శ్రీరామ్ రెడ్డి, ఎల్ఐసి నరసింహులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్, కృష్ణమూర్తి యాదవ్, చికెన్ తిరుపాల్, నారాయణస్వామి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు రాధమ్మ, రంగనాయకులు, రియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసన గా పట్టణంలోని ఎన్ టి ఆర్ సర్కిల్ లో గురువారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి సవితమ్మ స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూర్య నారాయణ, సోమశేఖర్, గుడిపల్లి రంగప్ప, వెంకటేష్, త్రివేంద్ర, దాదు, మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని వారపు సంతలో గురువారం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ 'బాబు కోసం నేను సైతం' అంటూ కరపత్రాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, మాజీ సింగల్ విండో అధ్యక్షులు డివి ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, సిపిఐ నాయకులు సాయి నగర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు అదే ఒక్క ఛాన్స్ తోనే ఇంటికి పంపడం ఖాయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ కదిరి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద 26వ రోజు పాల ఏకరి సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి కందికుంట వెంకటప్రసాద్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమలో పాలఏకిరి సంఘం నాయకులు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ దీక్షా కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని టిడిపి కుటుంబసభ్యులు హాజరై కందికుంట వెంకటప్రసాద్ కు తోడుగా ఉంటాం చంద్రబాబును కాపాడుకుంటామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంజనప్ప నాయుడు, శంకర్ నాయుడు, నాగరాజు, మల్లప్ప ,కదిరి టిడిపి మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.